క్లుప్తంగా

భైరవస్వామికి పూజలు


భైరవస్వామికి పూజలు చేస్తున్న ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు

సింహాచలం: కొత్త అమవాస్య పురస్కరించుకుని భైరవవాకలోని భైరవస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము 4గంటల నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు తరలి వచ్చి భైరవస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున దీపారాధన చేశారు. భక్తులతో ఆలయానికి వెళ్లే రెండు కిలోమీటర్ల మార్గం కిటకిటలాడింది. గోపాలపట్నం ట్రాఫిక్ సీఐ జి.శ్రీనివాసరావు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మద్దిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. సబాస్టియన్ కాలనీ 319 సచివాలయం పరిధి శివాలయం వెనుక బూట్ లాండ్రీ, స్పార్కెల్ లాండ్రీ సర్వీసెస్ ఎదురుగా ఉన్న తుప్పల్లో సుమారు 40 నుంచి 50 ఏళ్ల వయసున్న ఓ వ్యక్తి మృతదేహం పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే సచివాలయ మహిళా పోలీస్‌కు సమాచారం అందించారు. మహిళా పోలీస్‌తోపాటు అక్కడ విధులు నిర్వహిస్తున్న వీఆర్‌వో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతిచెందిన వ్యక్తి కోసం విచారించగా చుట్టుపక్కల ప్రాంతాల్లో భిక్షాటన చేస్తుంటాడని తెలిసింది. అతడు చనిపోయి సుమారు 3 నుంచి 5 రోజులై ఉండవచ్చని, శవం కుళ్లిపోయింది. ఐదో పట్టణ పోలీసులకు సోమవారం వీఆర్‌వో ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ బి.నరసింహమూర్తి కేసు దర్యాప్తు చేపట్టారు. మృతుడి వివరాలు తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

కూర్మన్నపాలెం: మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా పాలవలసకు చెందిన ఏలగట్ల సూర్యారావు(42) ఫార్మాసిటీలో మేనేజర్‌గా పని చేస్తూ అగనంపూడి కొండయ్యవలసలో అద్దె ఇంట్లో భార్య మణితో కలిసి నివాసముంటున్నాడు. ఇటీవల తండ్రి మృతి చెందడంతో అంత్యక్రియలకు వెళ్లిన సూర్యారావు, భార్యను అక్కడే ఉంచి వచ్చాడు. అయితే, పెళ్లయినా సంతానం కలగకపోవడం, తండ్రి కూడా మరణించడంతో మనస్తాపానికి గురైన సూర్యారావు అగనంపూడికి వచ్చి, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు దువ్వాడ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులకు విషయాన్ని తెలియపరిచారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడికి చికిత్స


యువకుడిని ఆస్పత్రికి తీసుకెళ్తున్న మమత

విశాఖ విద్య: మానసిక పరిస్థితి సరిగా లేక రోడ్లపై తిరుగుతున్న యువకుడికి బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. తగిన వైద్యం అందించడానికి ఆ యువకుడిని సోమవారం షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో చేర్పించారు. అతని ఆరోగ్య పరిస్థితి కుదుట పడిన తర్వాత వివరాలు తెలుసుకొని కుటుంబ సభ్యుల చెంతకు చేరుస్తామని మమత తెలిపారు.

నూకాంబికా.. నమోస్తుతే..

- కనులపండువగా అమ్మవారి జాతర
- కొత్త అమావాస్య వేళ ప్రత్యేక పూజలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- వైభవంగా అనుపు ఉత్సవాలు


40వ వార్డులోని నూకాంబిక ఆలయంలో పూజలు అందుకున్న అమ్మవారు


ఆలయ ప్రాంగణంలో పసుపు కుంకుమలతో పూజలు చేస్తున్న భక్తులు


గోపాలపట్నంలో భక్తులకు ప్రసాద వితరణ చేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

సింధియా: నూకాంబిక అమ్మవారి ఆలయాలు సోమవారం భక్తులతో పోటెత్తాయి. కొత్త అమావాస్య సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న భక్తులు మొక్కులు చెల్లించారు. జాతర సందర్భంగా నేలవేషాలు, డప్పులు, మేళతాళాలతో అంతటా సందడి నెలకొంది.

ఏకేసీ కాలనీలో జాతర మహోత్సవం

జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీ కాలనీలో కొలువుదీరిన నూకాంబిక అమ్మవారి జాతరను సోమవారం వైభవంగా జరిపించారు. ఆలయ ధర్మకర్త, కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన జాతర మహోత్సవాల్లో పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్న సమారాధనను ప్రారంభించారు. సాయంత్రం అనుపు మహోత్సవాన్ని మందుగుండు సామగ్రి, నేల డ్యాన్సులతో భారీ ఎత్తున నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

62వ వార్డులో..

జీవీఎంసీ 62వ వార్డు టీడీపీ కాలనీలోని నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర మహోత్సవాల్లో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం త్రినాథపురంలోని షిరిడీ సాయి బాబా ఆలయంలో అభిషేకాలు, పూజలు చేశారు. కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జీవీఎంసీ కో–ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, 3 జిల్లాల ట్రేడ్ యూనియన్ ఇన్‌చార్జి కలిదిండి బద్రీనాథ్, వార్డు అధ్యక్షుడు భీశెట్టి గణేష్, ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

63వ వార్డులో..

జీవీఎంసీ 63వ వార్డు గాంధీగ్రామ్ రెల్లికుల సంఘం ఆధ్వర్యంలో సింధియాలో నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర మహోత్సవాలు సోమవారం వైభవంగా జరిగాయి. కార్యక్రమంలో ఆడారి ఆనంద్‌కుమార్, కలిదిండి బద్రీనాథ్ పాల్గొని పూజలు చేశారు. అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సోమాదుల సురేష్, రౌతు అప్పారావు, ధనాల రామారావు, మర్యాద రాజా, భక్తులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన క్యూ లైన్లు

గోపాలపట్నం: కొత్త అమావాస్యను పురస్కరించుకుని నూకాలమ్మ పండగను వైభవంగా నిర్వహించారు. వేకువ జాము నుంచే నూకాలమ్మ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. చల్లగ చూడాలని ప్రజలు అమ్మవారిని మొక్కుకున్నారు. గోపాలపట్నం ప్రధాన రహదారిలో ఉన్న నూకాలమ్మ ఆలయానికి ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి దర్శనాలు చేసుకున్నారు. ఈ క్యూలైన్లు సాయంత్రం వరకు కొనసాగాయి. భక్తులకు ప్రసాదాలు, మజ్జిగ మంచినీరు అందించారు. పలువురు భక్తులు ఆలయ ప్రాంగణంలోని వేప చెట్టు వద్ద పసుసు కుంకుమలతో పూజలు చేశారు. మొక్కులు ఉన్న భక్తులు అమ్మవారికి గాజులు చీరలు సమర్పించుకున్నారు. ఆలయ చైర్మన్ మళ్ల సతీష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అమ్మవారిని దర్శించుకున్న నాయకులు

నూకాలమ్మ అమ్మవారిని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, ఎన్నికల పరిశీలకురాలు పేడాడ రమణ కుమారి, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 92వ వార్డు పద్మనాభనగర్‌లోని నూకాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని ఆడారి ఆనంద్‌కుమార్, బెహరా భాస్కరరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.
- 89వ వార్డు కొత్తపాలెంలో నూకాంబిక అమ్మవారిని కూడా దర్శించుకున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఆళ్ల పైడిరాజు, అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ, దొడ్డి కిరణ్ పాల్గొన్నారు.


జాతరలో అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న భక్తులు


62వ వార్డులోని ఆలయంలో అమ్మవారికి హారతి ఇస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్


92వ వార్డు పద్మనాభనగర్‌లో నూకాలమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఆనంద్ కుమార్


అమ్మవారి దర్శనానికి క్యూ లైన్లలో నిరీక్షిస్తున్న భక్తులు

ఉక్కు ఉద్యమం భావితరాలకు స్ఫూర్తి


దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: 'విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు' నినాదంతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకునేందుకు చేస్తున్న ఈ ఉద్యమం భావి తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1152వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సంస్థకు చెందిన సింటర్ ప్లాంట్ విభాగ కార్మికులు కూర్చుని ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ రైతులు సాగించిన పోరాట ఫలితంగా మోదీ ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకుందని, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు అటువంటి పోరాటాలు చేయక తప్పదన్నారు. ఉక్కు కర్మాగారం కోసం ప్రాణత్యాగాలు చేసిన వారిని మోదీ ప్రభుత్వం గుర్తు చేసుకోవాలన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తే ఉత్పత్తిలో పరుగులు పెడుతూ దేశంలో నెంబర్ వన్ పరిశ్రమగా ఎదుగుతుందని, కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

కాలానుగుణంగా మార్పు అవసరం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నారాయణరావు


నృత్యంతో అలరిస్తున్న విద్యార్థినులు

మురళీనగర్: డిప్లొమా విద్యార్థులు సోషల్ సైన్స్‌ను కూడా అధ్యయనం చేయాలని ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్స్ జనరల్ మేనేజర్ కె.తిలక్ కుమార్ సూచించారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు అధ్యక్షతన సోమవారం కళాశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి భారత రాజ్యాంగం, సామాజిక అవగాహన, పరిపాలన నైపుణ్యాల గురించి తెలుసుకోవాలన్నారు. సాంకేతిక విద్యలో పట్టు సాధించడంతోపాటు మారుతున్న కాలానికి అనుగుణంగా మనం మారాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగం పుస్తకాన్ని ఆయన కాలేజీ లైబ్రరీకి అందించారు. ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ చీఫ్ కన్సల్టెంట్ కె.ఎస్.ఎస్.ప్రకాశరావు మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్యాభివృద్ధికి అవసరమైన కోర్సుల నేర్చుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ నారాయణరావు మాట్లాడుతూ ఉద్యోగాల సాధనలో తమ కాలేజీ ముందంజలో ఉందన్నారు. నాలుగు బ్రాంచీలకు త్వరలో ఎన్‌బీఏ గుర్తింపు లభిస్తుందని చెప్పారు. వార్షికోత్సవంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

'నా ఆరోగ్యం - నా హక్కు'పై అవగాహన అవసరం


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శేషమ్మ. చిత్రంలో పూర్ణేంద్రబాబు, ఉమావతి

మహారాణిపేట: 'నా ఆరోగ్యం – నా హక్కు' అనే విషయంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకట శేషమ్మ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం రేసపువానిపాలెంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయ సమావేశ మందిరంలో 'నా ఆరోగ్యం – నా హక్కు' అనే అంశంపై లీగల్ అవేర్‌నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. జిల్లా ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శేషమ్మ మాట్లాడారు. ఫోక్సో చట్టం, బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కలెక్షన్, డిస్పోజల్ గురించి వివరిస్తూ లీగల్ అవేర్‌నెస్ ఏ విధంగా పాటించాలనే దానిపై వైద్యులు వృత్తి నియమాలు పాటిస్తూ చట్టబద్ధంగా ప్రవర్తించాలన్నారు. తద్వారా సమస్యలు ఉత్పన్నం కావని చెప్పారు. ఆరోగ్య విషయాల్లో పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డాక్టర్ పూర్ణేంద్రబాబు మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం వల్ల చాలా వ్యాధుల నుంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు, ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. జిల్లా నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి మాట్లాడుతూ మంచినీరు తాగడం వల్ల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా మీడియా విస్తరణ అధికారి(డిమో) బి.నాగేశ్వరరావు, పలువురు వైద్యులు డాక్టర్ బద్రీ, డాక్టర్ జగదీశ్ ప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ సయ్యద్ బేగం, హెల్త్ ఎడ్యుకేటర్, పలు ప్రైవేటు ఆస్పత్రుల డాక్టర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'స్కౌట్స్ అండ్ గైడ్స్'ను భాగం చేయండి


వీసీ ప్రసాదరెడ్డితో సమావేశమైన అసోసియేషన్ సభ్యులు

ఏయూ క్యాంపస్: హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ నూతన కార్యవర్గ సభ్యులు ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డిని సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన అధ్యక్షుడు ఎస్.మోహనరావు, కార్యదర్శి డి.వెంకట అప్పలనాయుడు, రాష్ట్ర చైర్మన్ ఆర్.హరి విఠల్.. వీసీని కలిసిన వారిలో ఉన్నారు. కేంద్ర మానవ వనరుల శాఖ గుర్తింపు పొందిన హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ విద్యార్థుల్లో క్రమశిక్షణ, యోగా. మెడిటేషన్ వంటివి నేర్పుతూ యువతను ఉత్తమ పౌరులుగా తయారు చేస్తుందని వారు అభిప్రాయపడ్డారు. దీనిలో శిక్షణ పొందిన విద్యార్థులకు ఉన్నత విద్య, ఉద్యోగాల కల్పనలో రిజర్వేషన్ ఉంటుందన్నారు. ఏయూ అనుబంధ కళాశాలలో స్కౌట్స్, గైడ్స్ భాగం చేయాలని కోరారు. తద్వారా విద్యార్థులు సంపూర్ణ వికాసానికి దోహదపడడం సాధ్యపడుతుందన్నారు. దీనికి వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి సానుకూలంగా స్పందించారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


గాంధీనగర్‌లో రౌడీ షీటర్లు, ఆకతాయిలకు అవగాహన కల్పిస్తున్న సీఐ గోవిందరావు

ఆరిలోవ: యువత మతుత్ పదార్థాలు వాడకానికి దూరంగా ఉండాలని ఆరిలోవ సీఐ జి.గోవిందరావు సూచించారు. తోటగరువు, రవీంద్రగనర్ ప్రాంతాలలో స్థానిక యవకులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటగరువు వద్ద పశు సంవర్థక శాఖకు చెందిన ఖాళీ స్థలం, విమ్స్‌కు సంబంధించిన ఖాళీ స్థలం, రవీంద్రగనర్, వివేకానందనగర్ శ్మశానవాటిక తదితర ప్రాంతాలలో యువకులు మతుత్ పదార్థాలు తీసుకుంటున్నట్లు తెలిసిందన్నారు. మద్యం, గంజాయి, బ్రౌన్ షుగర్ లాంటి మతుత్ పదార్థాల వాడకం వల్ల ఆరోగ్యం పూర్తిగా పాడై కుటుంబ సభ్యులకు, సమాజానికి దూరమవుతారన్నారు. ఎన్నికల వేళ కావడంతో యువకులు మరింత జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. ఎలాంటి అల్లర్లకు పాల్పడినా కేసులు తప్పవని హెచ్చరించారు. అల్లర్లు, కోట్లాటల వద్దకు వెళ్లొద్దని సూచించారు. ఎక్కడైనా ఆకతాయిలు, రౌడీషీటర్లు అల్లర్లు, గొడవలకు దిగుతున్నట్లు గమనిస్తే వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.

ప్రభుత్వ బడుల్లో సోషల్‌స్టడీస్‌కు ప్రాధాన్యం


ఎంపిక పత్రాన్ని అందజేస్తున్న పైడిరాజు, మహేశ్వరరావు

విశాఖ విద్య: ప్రభుత్వ బడుల్లో సోషల్ స్టడీస్‌కు ఎంతో ప్రాధాన్యత ఉంటుందని సోషల్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ గౌరవాధ్యక్షుడు ఇమంది పైడిరాజు అన్నారు. సోషల్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. నగరంలోని జూబ్లీ హైస్కూల్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడుగా ఇమంది పైడిరాజు (అడవివరం జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం), అధ్యక్షుడిగా సింగంపల్లి రామారావు(జీహెచ్‌ఎస్ పెందుర్తి), ప్రధాన కార్యదర్శిగా వి.బాలాజీ ఎంపికయ్యారు. మహిళా ప్రతినిధిగా ఎస్. సంధ్యారాణి (ప్రభుత్వ క్వీన్ మేరీ స్కూల్), గౌరవ సలహాదారుగా ఎస్.కృష్ణారావు, రాష్ట్ర కౌన్సిలర్‌గా టీ. రామారావు, అకడమిక్ సెల్ కన్వీనర్‌గా ఆర్‌వీ.నారాయణను ఎన్నుకున్నారు. అదేవిధంగా అసోసియేట్ అధ్యక్షుడిగా ఎం.పాండవులు, ఆర్థిక కార్యదర్శిగా ఎంవీఆర్ సోమరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోషల్ స్టడీస్‌పై విద్యార్థుల్లో ఆసక్తిని పెంచేలా భవిష్యత్‌లో కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ ఎస్.మహేశ్వరరావు నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు.

జీవన విధానాన్ని ప్రతిబింబించే పండగే ఉగాది

దాబాగార్డెన్స్: మానవ జీవన విధానాన్ని ప్రతిబింబించే పండగే ఉగాది అని బ్రహ్మకుమారీస్ ప్రతినిధి బీకే రామేశ్వరి తెలిపారు. బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో సోమవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఉగాది సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగాది విశిష్టతను ఆమె తెలిపారు. మన జీవితంలో జరిగే సంఘటనలన్నీ కూడా ఉగాది పర్వదినంతో ముడిపడి వుంటాయన్నారు. అందువల్లే తీపి, కారం, చేదు ఇలా అన్నీ సమపాళ్లలో మిళితం చేసి ఉగాది పచ్చడి చేస్తారన్నారు. నూతన సంవత్సరాదిని పురస్కరించుకొని ప్రతి ఒక్కరూ దేవాలయాలు సందర్శించి, ఆధ్యాత్మిక భావనతో ముందుకు సాగాలన్నారు. బ్రహ్మకుమారీస్ ప్రతినిధి సత్యవతి మాట్లాడుతూ పురాణ ఇతిహాసాల్లో ఉగాది పర్వదినానికి ఎనలేని ప్రాధాన్యత ఉందన్నారు. కార్యక్రమంలో జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, నాగరాజ్ పట్నాయక్, పావని పాల్గొన్నారు.

నెలాఖరులోగా ఆస్తిపన్ను చెల్లించాలి

గాజువాక: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నును ఈనెల 30లోగా చెల్లించే భవన యజమానులకు 5 శాతం రాయితీ ఇస్తున్నట్టు జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ బి.సన్యాసినాయుడు తెలిపారు. ఈ అవకాశాన్ని ఆస్తిపన్ను చెల్లింపుదారులందరూ వినియోగించుకోవాలని కోరారు. గాజువాక జోనల్ కార్యాలయంలో సౌకర్యం కేంద్రంతో పాటు ఆన్‌లైన్, వార్డు సచివాలయాల్లో పన్నును చెల్లించవచ్చన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమం


92వ వార్డులో ప్రచారం చేస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: అభివృద్ధి, సంక్షేమాలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చిన వైఎస్సార్‌సీపీని గెలిపించాలని పార్టీ మండల అధ్యక్షుడు, జీవీఎంసీ కో–ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు కోరారు. ఎమ్మెల్యేగా ఆడారి ఆనంద్‌కుమార్, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మి విజయానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. 92వ వార్డు బాపూజీనగర్, శ్రీనుబాబు నగర్‌లో సోమవారం ఆయన ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. కాలనీలో ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నియోజకవర్గానికి పార్టీ ఇన్‌చార్జిగా ఆడారి ఆనంద్‌కుమార్ బాధ్యతలు చేపట్టాక ఎంతో అభివృద్ధి చేశారన్నారు. ఏడాదిన్నరగా నియోజకవర్గంలో ప్రజలతో మమేకమై ఎన్నో సేవాకార్యక్రమాలు నిర్వహించారన్నారు. పేదలకు సాయం చేశారని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గుణిశెట్టి శ్రీనివాసరావు, 92వ వార్డు నాయకులు గొర్లె అప్పలస్వామి నాయుడు, బూరెడ్డి గోపీ, బూత్ కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆక్రమిత భూముల్లో హెచ్చరిక బోర్డులు


హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తున్న ఐలా సిబ్బంది

కూర్మన్నపాలెం: వడ్లపూడి ఆటోనగర్ ఈ బ్లాక్ దరి బసవ తారకనగర్‌లో ఏపీఐఐసీ గ్రీన్ బెల్ట్ స్థలంలో ఆక్రమణలను అడ్డుకునేందుకు అధికారులు సోమవారం హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు అక్రమ నిర్మాణాలు చేస్తూ రహదారులను, ఏపీఐఐసీ స్థలాలను ఆక్రమిస్తున్నారని అధిక సంఖ్యలో ఫిర్యాదులు రావడంతో ఏపీఐఐసీ డీజెడ్‌ఎం జయరాం సిబ్బందితో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయించారు. ఆయన మాట్లాడుతూ కబ్జాలకు పాల్పడుతున్న వ్యక్తులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. అటువంటి వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ జూనియర్ మేనేజర్ వై.రాంబాబు, ఏఈ అవినాష్, ఐలా సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి సీతారామ కల్యాణోత్సవాలు

సీతంపేట: లలితానగర్ శ్రీలలితా పీఠంలో ఉగాది నుంచి వసంత నవరాత్రి సీతారామ కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేస్ తెలిపారు. ఈ నెల 9వ తేదీ చైత్ర శుద్ధ పాడ్యమి నుంచి 18 దశమి వరకు కల్యాణోత్సవాలు జరుగుతాయన్నారు. ఉగాది రోజు లలితాదేవికి క్షీరాభిషేకం, బంగారు చీర అలంకరణ, పంచాంగ శ్రవణం, కర్ణాటక సంగీత కచేరి నిర్వహిస్తామని చెప్పారు. 18న చక్రస్నానం, పూర్ణాహుతి జరుగుతాయని తెలిపారు.